
విద్యార్థులకు 'వీర్ బాల్ దివస్' విశిష్ఠతను వివరిస్తున్న వెంకటరాంరెడ్డి

## బీజేపీ ఆధ్వర్యంలో 'వీర్ బాల్ దివస్'

**అల్లాపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** అల్లాపూర్ డివిజన్ వివేకానంద నగర్‌లో సోమవారం 'వీర్ బాల్ దివస్'ను ముందస్తుగా జరుపుకున్నారు. సిక్కుల మతగురువు గోవింద్ సింగ్‌జీ కుమారులు జరావర్‌సింగ్, ఫతేహ్‌సింగ్‌లు మతమార్పిడిని వ్యతిరేకించి ప్రాణత్యాగానికి ప్రతీకగా డిసెంబరు 26న 'వీర బాల్ దివస్' జరుపుకుంటామని బీజేపీ అల్లాపూర్ డివిజన్ నేతలు సీహెచ్ వెంకట్‌రాంరెడ్డి, తదితరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి మల్కాజిగిరి జిల్లా (అర్బన్) ఓబీసీ మోర్చా కార్యదర్శి గోనెల సుదర్శన్ ముదిరాజ్, మల్కాజిగిరి నార్త్ ఇండియా మోర్చా కన్వీనర్ పూజారాం, రవి, మనోజ్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.


ట్రాఫిక్‌పోలీసులు, అధికారులను ప్రశ్నిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, చిత్రంలో కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తదితరులు

## పేదలపై మీ ప్రతాపం ఏంటి ?

### జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులపై ఎమ్మెల్యే ఆగ్రహం

**కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** 'రోడ్ల వెంట బతికే వారిపై మీ దౌర్జన్యం ఏంటి? పేదలు ఏమి అనరనా? సామాన్యుడు బతకడం మీకు ఇష్టం లేదా' అంటూ ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం జీహెచ్‌ఎంసీ అధికారులు, ట్రాఫిక్ పోలీసులపై ప్రశ్నల వర్షం కురిపించారు. ఈ మేరకు కేపీహెచ్‌బీ ఐదో, తొమ్మిదో ఫేజ్ మార్గాల్లో ఇటీవల జీహెచ్‌ఎంసీ, ట్రాఫిక్ పోలీసులు డబ్బాలను తొలగించడంతో వారంతా రోడ్డున పడ్డారు. కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, అధికారులతో కలిసి వీధి వ్యాపారులను పరామర్శిస్తూ వారికి జరిగిన నష్టం గురించి తెలుసుకొన్నారు. ఆపై అధికారులపై ఆగ్రహించారు. పెద్దపెద్ద షాపింగ్ మాల్స్, వ్యాపారస్తులను వదిలేసి జీవనం సాగించేందుకు రోడ్ల వెంట డబ్బాలు పెట్టుకొని వ్యాపారం చేసుకుంటున్న వారి జీవితాలతో చెలగాటం ఆడటం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. పార్కింగ్‌లు లేకుండా వ్యాపారాలు చేసుకుంటున్న వ్యాపారస్తులను వదిలేసి రోడ్ల వెంట బతుకుతున్న వారి డబ్బాలను నేలమట్టం చేయడంతో ఆర్థికంగా చితికిపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

**● ఈ స్థలం అమ్మేద్దాం అనుకుంటున్నారా?**

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు రమ్యగ్రౌండ్ బాల్ బ్యాడ్మింటన్ కోర్టును సందర్శించి అక్కడ హౌసింగ్‌బోర్డు స్థలం తమది అంటూ హౌసింగ్ బోర్డు అధికారులు బోర్డు ఏర్పాటు చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రయోజనాల కోసం ఉన్న స్థలాన్ని అమ్ముకుందామనుకుంటున్నారా అంటూ ఫోన్‌లోనే అధికారులను ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో మల్కన్నగారి కృష్ణారెడ్డి, మందలపు సాయిబాబు చౌదరి, శ్యామలరాజు, పాతూరి గోపీ, జె.నారాయణరావు, కట్టా నరసింగరావు, జీఎల్ఎన్ రెడ్డి, భాస్కర్ నాయీ, తులసిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


డ్రమ్ముల్లో దోమల మందు పిచికారి చేస్తున్న ఎంటమాలజీ సిబ్బంది

## దోమల నివారణ మందు పిచికారి

**హైదర్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** ఆల్విన్‌కాలనీ ఎల్లమ్మబండ, దత్తాత్రేయకాలనీలో కూకట్‌పల్లి డిప్యూటీ కమిషనర్ ఆదేశాలతో ఎంటమాలజీ సూపర్‌వైజర్ నరసింహులు సిబ్బందితో కలిసి మంగళవారం దోమల నివారణ మందు పిచికారి చేశారు. కాలనీలోని ప్రతీ ఇంటికి వెళ్లి నీరు నిల్వఉన్న ప్రాంతాలను పరిశీలించారు. పాత్రలు, డ్రమ్ముల్లో నీరు లేకుండా చర్యలు తీసుకున్నారు. అదే విధంగా స్థానికులకు దోమల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఇళ్ల పరిసరాల్లో నీరు నిల్వవుండకుండా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంటమాలజీ సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

## బిల్డర్‌ను బెదిరించిన కేసులో రిపోర్టర్ అరెస్టు

**హైదర్‌నగర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):** అక్రమ నిర్మాణం కడుతున్నారంటూ ఓ బిల్డర్‌ను బెదిరించిన కేసులో విలేకరిని కేపీహెచ్‌బీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-7లో ఎంఐజీ 43లో పవన్‌కుమార్ అనే వ్యక్తి భవనం నిర్మిస్తున్నాడు. అక్కడికి రిపోర్టర్లమంటూ జంగాల నాగార్జున, బత్తిన సుమన్‌గౌడ్ వెళ్లి చెరో లక్ష ఇవ్వాలని, లేకపోతే నిర్మాణంపై జీహెచ్‌ఎంసీలో ఫిర్యాదు చేసి కూల్చివేయిస్తామని బెదిరిస్తున్నారని పవన్‌కుమార్ గత వారం కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈమేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం జంగాల నాగార్జునను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. మరో నిందితుడు బత్తిని సుమన్‌గౌడ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## తెలుగు వర్సిటీ సాహితీ పురస్కారాలకు సూచనలు

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** తెలుగు యూనివర్సిటీ 2023 సంవత్సరానికి ప్రదానం చేసే సాహితీ పురస్కారాల ఎంపికకు పాఠకులు, రచయితల నుంచి సూచనలను ఆహ్వానిస్తున్నట్లు రిజిస్ట్రార్ కోట్ల హన్మంతరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివిధ ప్రక్రియలో 2020 జనవరి నుంచి 2022 డిసెంబర్ మధ్యకాలంలో తొలిసారిగా ప్రచురణ పొందిన గ్రంథాల్లో పాఠకులు ఉత్తమంగా భావించిన వాటిని పరిగణలోకి తీసుకుంటామని, రచయిత మరణించినప్పటికీ వారి రచనలు ఆయా సంవత్సరాల మధ్యకాలంలో ప్రచురణ పొంది ఉంటే సూచించవచ్చని తెలిపారు. గేయ కవిత ప్రక్రియలో మాత్రం 2020 నుంచి 2022 మధ్య ప్రచురణ పొందిన గ్రంథాలను సూచించాలని కోరారు. వచన కవిత, పద్యకవిత, బాలసాహిత్యం, నవల, కథానికల సంపుటి, నాటకం/నాటికల సంపుటి, సాహిత్య విమర్శ, అనువాద సాహిత్యం, వచన రచన, గేయ కవిత, రచయిత్రి ఉత్తమ గ్రంథం అనే 11 ప్రక్రియల్లో అన్నీ ప్రక్రియలకుగానీ, కొన్నింటికిగానీ, తమకు నచ్చిన గ్రంథాలను పురస్కారాలకు సూచించవచ్చని తెలిపారు. సూచనలలో ప్రక్రియ పేరు, గ్రంథం పేరు, రచయిత పేరు, చిరునామా, పేజీల సంఖ్య, ప్రచురణ సంవత్సరం, ప్రచురణకర్త పేరు పేర్కొనాలని, రచయితలు కూడ తమ గ్రంథాలను స్వయంగా సూచించవచ్చని తెలిపారు. పాఠకులుగానీ, రచయితలుగానీ తమ సూచనలను రిజిస్ట్రార్ పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీ, నాంపల్లి, హైదరాబాద్-500004 చిరునామాకు జనవరి20లోపు పంపాలని కోరారు.

## వాంతి వస్తున్నట్లు నటించి ప్రయాణికుడి గొలుసు చోరీ

**బంజారాహిల్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** ఆర్టీసీ బస్సులో వాంతి వస్తున్నట్లు ఓ వ్యక్తి నటించగా మరికొందరు హడావుడి చేసి ప్రయాణికుడి మెడలో నుంచి గొలుసు చోరీ చేశారు. కేపీహెచ్‌బీ కాలనీలోని ఓ హాస్టల్‌లో ఉండే శ్రీకాంత్ దంగేటి మెహదీపట్నం వెళ్లి తిరిగి హాస్టల్‌కు వెళ్లేందుకు ఆర్టీసీ బస్సు ఎక్కాడు. కొద్దిసేపటికి పక్కనే ఉన్న వ్యక్తి వాంతి వచ్చినట్టు నటించడంతో చిరాకు పడిన అతడు వెనుకభాగంలోకి వెళ్లాడు. అక్కడ మరో ముగ్గురు వ్యక్తులు అతని పట్ల దురుసుగా ప్రవర్తించారు. దీంతో శ్రీకాంత్ జీవీకే మాల్ వద్ద బస్సు దిగాడు. మెడలో చూసుకుంటే 11 గ్రాముల బంగారు గొలుసు కనిపించలేదు. అంతా పథకం ప్రకారమే తన గొలుసు చోరీ చేసినట్లు గ్రహించిన బాధితుడు బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# నిజాంపేట రోడ్డు విస్తరణ జరిగేనా?

**● నిత్యం ట్రాఫిక్‌జాంలతో అవస్థలు**
**● కాలనీవాసుల, వాహనదారుల ఇబ్బందులు**

**హైదర్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** నగర శివారు ప్రాంతం వేగంగా విస్తరిస్తోంది. అందులో హైదర్‌నగర్, నిజాంపేట ప్రాంతాలు కొత్త అపార్ట్‌మెంట్లు, గేటెడ్ కమ్యూనిటీలతో అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్నాయి. దీంతో సమస్యలు కూడా పెరుగుతున్నాయి. ముఖ్యంగా ఈప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య రోజురోజుకూ పెరుగుతుండడంతో వాహనదారులు, స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డులో గంటల తరబడి ట్రాఫిక్ నిలిచిపోయిన సంఘటనలూ ఉన్నాయి. నిజాంపేట రోడ్డులో కాలనీలు విస్తరిస్తుండడంతో పాటు అపార్ట్‌మెంట్‌లు పెద్దఎత్తున వెలుస్తున్నాయి. ఇక్కడి జనాభా లక్షలకు చేరుతోంది. జాతీయ రహదారి నుంచి బాచుపల్లి వరకు సుమారు ఆరు కిలోమీటర్ల ప్రాంతంలో సుమారు 130కిపైగా కాలనీలు, రెట్టింపు స్థాయిలో అపార్ట్‌మెంట్లు ఉన్నాయి. దీంతో ఈ రహదారిలో ట్రాఫిక్‌జాంలు ఏర్పడుతున్నాయి. ఈ విషయాన్ని పలుమార్లు స్థానికులు అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లారు. సుమారు 8 ఏళ్ల క్రితం రోడ్డు విస్తరించాలని జీహెచ్‌ఎంసీ అధికారులు భావించారు. జాతీయ రహదారి నుంచి కొలను రాఘవరెడ్డి గార్డెన్స్ వరకు సుమారు కిలోమీటర్ మేర ఇరువైపులా రోడ్డును విస్తరించి మధ్యలో డివైడర్‌ను ఏర్పాటు చేశారు. కానీ రోడ్డుకు ఇరువైపులా స్తంభాలు తొలగించకపోవడంతో ప్రయాణం సాఫీగా సాగడం లేదు. దీంతో రోడ్డు విస్తరించిన ఫలితం లేకుండా పోయిందని స్థానికులు వాపోతున్నారు. ప్రస్తుతం ఉన్న జనాభాకు అనుగుణంగా వంద అడుగులు విస్తరించాలని ప్రజలు కోరుతున్నారు. హెచ్‌ఎండీఏ మాస్టర్ ప్లాన్‌లోను ఈరోడ్‌ను వంద అడుగుల రోడ్డుగా అధికారులు నిర్ధారించారు. తర్వాత విస్తరణలో తీవ్ర జాప్యం జరుగుతోంది.


రాఘవరెడ్డి ఫంక్షన్‌హాల్ సమీపంలో ఉన్న యూటర్న్‌వద్ద భారీగా నిలిచిపోయిన వాహనాలు


హోలిస్టిక్ ఆస్పత్రి వద్ద వాహనాల రద్దీ

### ఉదయం, సాయంత్రం ట్రాఫికర్

నిజాంపేట రోడ్డు ప్రాంతం నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే ఉద్యోగుల సంఖ్య రోజురోజుకు అధికమమవుతోంది. ఈ రోడ్డులో బస్సులు, కార్లు, ద్విచక్రవాహనాలు, ఆటోలు ఎక్కువగా రాకపోకలు సాగిస్తున్నాయి. ఐటీ కారిడార్ దగ్గరగా ఉండడంతో పాటు పాఠశాలలు, కళాశాలు అధికంగా ఉండడంతో బస్సుల్లో రద్దీ తీవ్రంగా కనిపిస్తోంది. దీంతో ఉదయం, సాయంత్రం తీవ్ర ట్రాఫిక్‌జాం ఏర్పడుతోంది. నిమిషాల వ్యవధి ప్రయాణానికి గంటల సమయం పడుతుంది. ముఖ్యంగా జాతీయ రహదారిపై ఈ రోడ్డు ప్రారంభంలో ఉన్న హోటల్ వద్ద అస్తవ్యస్తంగా వాహనాలు పార్కింగ్ చేస్తుండడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమవుతోంది. ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్డు విస్తరణ చేపట్టాలని కోరారు.

### రోడ్డు విస్తరణ వెంటనే చేయాలి



అప్పటి జనాభాకు అనుగుణంగా రోడ్లు నిర్మించారు. కానీ గడిచిన పదేళ్లలో నిజాంపేట రోడ్డు ప్రాంతంలో నివాసాలు పెరగడంతో జనాభా మూడింతలు పెరిగింది. దీంతో వాహనాల సంఖ్య పెరిగి రద్దీ విపరీతంగా మారింది. రద్దీ సమయంలో ట్రాఫిక్ స్తంభించిపోతుంది. ఈ విషయమై అధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకువెళ్లి రోడ్డు విస్తరణ చేయాలని కోరాం. ఉదయం, సాయంత్రం ట్రాఫిక్ నిలిచిపోతుంది. దీంతో సకాలంలో కార్యాలయాలకు చేరుకోలేక పలువురు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ చేపట్టాలి.

- కొడాలి రవికుమార్, స్థానికుడు


కేపీహెచ్‌బీ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన వేడుకల్లో సర్వే సత్యనారాయణ, కాంగ్రెస్ ఇన్‌చార్జి రమేష్


కేపీహెచ్‌బీలోని ఫ్యూచర్ ప్రాపర్టీ గ్రూప్ కార్యాలయంలో నిర్వహించిన వేడుకల్లో ఎండీ కంచర్ల శ్యాంసుందర్, సీఎండీ పసుపులేటి రామకృష్ణ, ఉద్యోగులు


మూసాపేట్‌లోని పంచశీల స్కూల్లో క్రిస్మస్ వేడుకల్లో శాంతా క్లాజ్, దేవదూతల వేషధారణలో చిన్నారులు.

# వాడవాడలా సెమీ క్రిస్మస్ వేడుకలు

**కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):** వాడవాడలా సెమీ క్రిస్మస్ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. క్రిస్మస్ ప్రాముఖ్యతను పాస్టర్లు వివరించారు. కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, మూసాపేట్ డివిజన్ల పరిధిలో చర్చిలు, ప్రధాన కూడళ్లలో నిర్వహించిన వేడుకలకు వేలాది భక్తులు హాజరయ్యారు.

### అట్టహాసంగా వేడుకలు

**అల్లాపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** అల్లాపూర్ డివిజన్ గాయత్రినగర్‌లో మంగళవారం సెమీ క్రిస్మస్ వేడుకలు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఇండోర్ స్టేడియం ఆవరణలో జరిగిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్న కార్పొరేటర్ సబీహాబేగంను నిర్వాహకులు సన్మానించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సబీహాబేగం మాట్లాడుతూ.. ప్రేమ, దయ, కరుణకు ప్రతీకగా ఉన్న క్రీస్తు జననం గురించి సందేశాన్ని అందిస్తూ జరుపుకునే పండగా అని పేర్కొన్నారు. కార్యక్రమంలో సంజీవరెడ్డి, జితేంద్ర, మోజెస్, జ్ఞానేశ్వర్, టీఆర్ఎస్ రాజు, నర్సింహ మాస్టర్, రమణ, సతీష్, మణెమ్మ, బద్రూనాయక్ తదితరులు పాల్గొన్నారు.


సెమీ క్రిస్మస్ వేడుకల సందర్భంగా అల్లాపూర్ కార్పొరేటర్ సబీహ బేగంను సన్మానిస్తున్న నిర్వాహకులు


విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్న కేపీహెచ్‌బీ రోడ్డు నంబర్-1లోని ట్రినిటీ లూథరన్ చర్చి

### చర్చిలు ముస్తాబు

**కేపీహెచ్‌బీకాలనీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):** క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాభయ్యాయి. కేపీహెచ్‌బీ, బాలాజీనగర్, మూసాపేట్ ప్రాంతాల్లో చిన్న చర్చిలు మొదలుకొని పెద్ద చర్చిల వరకు ప్రార్థలనకు ఏర్పాట్లు చేశారు. చర్చిలన్నీ విద్యుత్ కాంతులతో ధగధగలాడుతున్నాయి. బుధవారం చర్చిల్లో క్రిస్మస్ వేడుకల సందర్భంగా ప్రార్థనలు జరుగనున్నాయి.

## వినియోగదారుల రక్షణ చట్టాలపై అవగాహన కల్పించాలి

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** వినియోగదారుల రక్షణ చట్టాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని రాష్ట్ర పౌర సరఫరాల శాఖ కమిషనర్ డీఎస్ చౌహాన్ అధికారులకు సూచించారు. కలెక్టరేట్ కాన్ఫరెన్స్‌హాల్‌లో జిల్లా పౌర సరఫరాల శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ వినియోగదారుల హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ చౌహాన్ మాట్లాడుతూ.. 1986 డిసెంబర్ 24న వినియోగదారుల రక్షణ చట్టం అమలులోకి వచ్చిందని, అప్పటి నుంచి వినియోగదారులకు నిర్విరామంగా సేవలు అందుతున్నాయన్నారు. ఆహార పదార్థాలు, నగలు, ఇతర వస్తువులను కొనుగోలు చేసే సమయంలో ధరలు, నాణ్యతా ప్రమాణాలు తెలుసుకోవాలన్నారు. ఎక్కడైనా అన్యాయం జరిగితే సత్వరమే వినియోగదారుల ఫోరంలో దరఖాస్తు చేసుకుని న్యాయపరంగా పోరాటాలు చేసి నష్టపరిహారం పొందాలని తెలిపారు. ప్రజలతో పాటు పాఠశాల, కళాశాల విద్యార్థులను కూడా వినియోగదారుల చట్టాలపై చైతన్యం చేయాలన్నారు. అనంతరం వినియోగదారుల చట్టాలపై ఉపన్యాసం ఇచ్చిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కాగా, తొలుత తూనికల కొలతల శాఖ ఏర్పాటు చేసిన వివిధ రకాల వస్తువుల స్టాళ్లను కమిషనర్ సందర్శించారు. డీసీఎస్ఓ రమేష్, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ అరుణ్‌సాయి, తూనికల కొలతల అధికారి శివానంద్ పాల్గొన్నారు.

# లిక్విడ్ గంజా సరఫరా ముఠా అరెస్ట్

**● ఒడిశాలో లీటర్ గంజా రూ.1.2 లక్షలు.. నగరంలో రూ.3 లక్షలు**
**● 4 లీటర్ల హాష్ ఆయిల్, కారు, 4 సెల్‌ఫోన్లు స్వాధీనం**
**● నిందితులకు రిమాండ్**

**అబ్దుల్లాపూర్‌మెట్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి):** ఒడిశా నుంచి హైదరాబాద్‌కు గంజా హాష్‌ఆయిల్ (లిక్విడ్ గంజా)ను సరఫరా చేస్తున్న నలుగురు సభ్యుల ముఠాను అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి 4 లీటర్ల హాష్ ఆయిల్‌తో పాటు 4 సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం వారిని హయత్‌నగర్ కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన జయదేవ్ హైదర్ (37), అదే ప్రాంతానికి చెందిన జితేంద్ర పంగి(38), దేబమది(32), ఆకాష్‌సర్కార్(21) నలుగురూ కలిసి ముఠాగా ఏర్పడ్డారు. కొంతకాలంగా ఒడిశా తక్కువ ధరకు హాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి కారులో హైదరాబాద్‌కు తెచ్చి, ఇక్కడ ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారు. ఒడిశా నుంచి కారులో హాష్ గంజా తీసుకువస్తున్నట్లు అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులకు సోమవారం విశ్వసనీయ సమాచారం అందింది. సాయంత్రం మెట్ చౌరస్తాలోని కృష్ణవేణి స్కూల్ కమాన్ వద్ద పోలీసులు వాహన తనిఖీ చేపట్టారు. స్విఫ్ట్ కారు (ఒడీ30ఈ4049)లో తనిఖీ చేయగా నాలుగు ప్లాస్టిక్ బ్యాగుల్లో ప్యాకెట్లలో హాష్ ఆయిల్‌ను పోలీసులు గుర్తించారు. వెంటనే నలుగురిని అదుపులోకి తీసుకుని కారుతో పాటు హాష్‌ఆయిల్, 4సెల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. విచారించగా హాష్ ఆయిల్‌ను వనస్థలిపురానికి చెందిన చిన్నకు సరఫరా చేసేందుకు తీసుకెళ్తున్నట్లు తెలిపారు. ఒడిశాలో ఒక లీటర్ హాష్ ఆయిల్‌ను రూ.1.20లక్షలకు కొనుగోలు చేసి హైదరాబాద్‌లో రూ.3లక్షలకు విక్రయిస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు. ఏ-1 జయదేవ్ హైదర్ 2019లో గంజాకేసులో జైలుకు వెళ్లి వచ్చాడు. ఆ తర్వాత కూడా గంజా వ్యాపారం చేస్తున్నాడని తెలిపారు. మంగళవారం నలుగురు నిందితులను రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.


హాష్ ఆయిల్‌తో పట్టుబడిన నిందితులు

## బాలికపై లైంగికదాడికి యత్నం.. నిందితుల అరెస్ట్

**బంజారాహిల్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** ఆటోలో వస్తున్న బాలికపై ఓ ఆటో డ్రైవర్ కన్నేశాడు. ఆమెతో ఉన్న యువకుడిని బెదరించి, తనస్నేహితులతో కలిసి బాలికపై లైంగిక దాడికి యత్నించాడు. ఈ ఘటనలో ఆటో డ్రైవర్‌తో పాటు మరో ముగ్గురిని బోరబండ పోలీసులు సోమవారం అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. బోరబండ సైట్ 3 ప్రాంతానికి చెందిన బాలికస్నేహితునితో కలిసి సోమవారం మాదాపూర్ నుంచి ఇంటికి రావడానికి రాత్రి సమయంలో ఆటోలో ఎక్కారు. ఆటో డ్రైవర్ విషయాన్ని తన స్నేహితులకు చెప్పడంతో మార్గమధ్యలో ముగ్గురు వ్యక్తులు ఆటో ఎక్కారు. ఇద్దరు డ్రైవర్‌కు చెరో వైపు కూర్చోగా, మరో వ్యక్తి వెనుక కూర్చున్నాడు. బాలిక పక్కన కూర్చొన్న ఆమె స్నేహితుడిని బెదిరించి ఆమెతో అసభ్యంగా ప్రవర్తించి లైంగిక దాడికి యత్నించారు. బాలిక భయంతో కేకలు వేయడంతో స్థానికులు వచ్చి ఏమైందని ఆరా తీయగా ఆమె విషయాన్ని వివరించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వగా నిందితులను అదుపులోకి తీసుకున్నారు. మంగళవారం వారిని రిమాండ్‌కు తరలించినట్లు తెలిసింది.

## కాఫీ షాప్ ముసుగులో వ్యభిచారం

**బంజారాహిల్స్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** కాఫీ షాప్ ముసుగులో వ్యభిచారం నిర్వహిస్తున్న మహిళపై కేసు నమోదైంది. బంజారాహిల్స్ రోడ్డు నంబర్ 2లో కొత్తగా ఏర్పాటు చేసిన కాఫీ షాప్‌లో వ్యభిచారం జరుగుతున్నట్లు పోలీసులకు సమాచారం అందడంతో పోలీసులు దాడులు నిర్వహించారు. ఇద్దరు యువతులు, ఓ విటుడిని అదుపులోకి తీసుకుని విచారించగా అక్కడ వ్యభిచారం చేస్తున్నట్టు తేలింది. నిర్వాహకురాలు నిఖిత పరారీలో ఉంది. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

# దాతలు స్పందిస్తే.. దత్తత ఇచ్చేస్తాం!

**● జేఎన్‌టీయూ అనుబంధ కాలేజీల్లో దయనీయ పరిస్థితులు**
**● ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ బాలకిష్టారెడ్డి**
**● ఫిబ్రవరి 8న జేఎన్‌టీయూ గ్లోబల్ అలూమ్ని మీట్**
**● 'జెగమ్-25' పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉన్నతాధికారులు**


పోస్టరును ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్, డైరెక్టర్ తదితరులు

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** దాతలు ముందుకొస్తే జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలను దత్తత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఇన్‌చార్జి వీసీ డాక్టర్ బాలకిష్టారెడ్డి స్పష్టం చేశారు. ఫిబ్రవరిలో నిర్వహించనున్న జేఎన్‌టీయూ గ్లోబల్ మీట్ (జెగమ్-25)కు సంబంధించిన పోస్టరును మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. గత పదేళ్లలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిరిసిల్ల, వనపర్తి, మహబూబాబాద్, పాలేరు జేఎన్‌టీయూ కాలేజీలు దయనీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆయా కాలేజీల్లో తరగతి గదులు, హాస్టల్స్, వసతులు లేవన్నారు. ఈ కాలేజీలతో పాటు సుల్తాన్‌పూర్, మంథని జేఎన్‌టీయూ కాలేజీల్లోనూ పదేళ్లుగా బోధన, బోధనేతర సిబ్బందిని నియమించకపోవడం, నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్వహణ దుర్భరంగా మారిందని చెప్పారు.

### పూర్వ విద్యార్థులు ముందుకు వస్తే...

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో స్థిరపడిన జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థులు తమ స్వస్థలాలకు సమీపంలోని వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీల బాగు కోసం తోడ్పాటు అందించాలని కోరుతున్నట్లు ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. 2023లో నిర్వహించిన గ్లోబల్ అలూమ్ని మీట్‌కు పూర్వ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందని, హైదరాబాద్ జేఎన్‌టీయూ అభివృద్ధికి ఎంతోమంది ఇతోధికంగా విరాళాలు అందించారని చెప్పారు. రానున్న ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనం('జెగమ్-25' )లో అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఏఎస్ఆర్) కింద స్పందించిన దాతలకు ఆయా కాలేజీలను దత్తత ఇస్తామన్నారు. వర్సిటీ అనుబంధ కాలేజీల్లో అధ్యాపకుల కొరతకు ప్రత్యామ్నాయంగా జేఎన్‌టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్లతో ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన ఈ-కంటెంట్ స్టూడియోను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు.

### జెగమ్ నిర్వహణతో గ్లోబల్ కనెక్టివిటీ

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థుల మధ్య కనెక్టివిటీని పెంచేందుకు గ్లోబల్ అలుమ్ని మీట్ దోహదపడుతుందని అలూమ్ని విభాగం డైరెక్టర్ జె.సురేశ్‌కుమార్ వెల్లడించారు. విద్యాభివృద్ధి, గ్లోబల్ కనెక్టివిటీ, సామాజిక సేవలపై ఆసక్తికర చర్చలకు జెగమ్-25 మంచి వేదిక కానుందన్నారు. వివిధ దేశాల్లో ఉంటున్న పూర్వ విద్యార్థులతో మంచి సంబంధాలు కలిగి ఉండి.. శాస్త్రీయ పరిశోధన, ప్రాజెక్టుల అభివృద్ధిలో వారి సహకారం తీసుకుంటామన్నారు. గతేడాది రిజిస్ట్రేషన్లు 5వేలు ఉండగా, ఈ ఏడాది పూర్వవిద్యార్థుల రిజిస్ట్రేషన్లు 18 వేలకు పెరిగాయన్నారు. సాంకేతికత ద్వారా యూనివర్సిటీని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం, జేఎన్‌టీయూ కాలేజీల విద్యార్థులకు శిక్షణ, ప్లేస్‌మెంట్ అవకాశాలను మెరుగుపరచడం, ఇతర దేశాలకు చెందిన విద్యాసంస్థలతో అంతర్జాతీయ అవగాహన ఒప్పందాలను కుదుర్చుకోవడం జెగమ్-25 ప్రధాన లక్ష్యాలని డైరెక్టర్ సురేశ్‌కుమార్ తెలిపారు. పోస్టరు ఆవిష్కరణ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు, ప్రిన్సిపాల్స్ నర్సింహారెడ్డి, సింధు, డిప్యూటీ డైరెక్టర్ క్రాంతికిరణ్, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

# జేఎన్‌టీయూకు జూనియర్లు

**● 49 మంది జూనియర్ అసిస్టెంట్లకు పోస్టింగ్ ఆర్డర్లు**
**● వచ్చిన ఉద్యోగాన్ని వదులుకున్న 35శాతం మంది అభ్యర్థులు**

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** జేఎన్‌టీయూతో పాటు అనుబంధంగా ఉన్న ఇంజనీరింగ్, మేనేజ్‌మెంట్ కళాశాలల్లో 49 మంది కొత్త జూనియర్ అసిసెంట్లకు పోస్టింగులు ఇస్తూ వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఉత్తర్వులు జారీచేశారు. వర్సిటీలో ఖాళీగా ఉన్న 75 జూనియర్ అసిస్టెంట్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇవ్వగా, గ్రూప్-4 పరీక్షలో పాసైన అభ్యర్థుల్లో 64 మంది యూనివర్సిటీలో రిపోర్టు చేశారు. 49 మంది వివిధ కళాశాలల్లో జూనియర్ అసిస్టెంట్లుగా చేరేందుకు పోస్టింగ్ ఉత్తర్వులు అందుకోగా, వివిధ కారణాలతో 26 మంది తమకు వచ్చిన ఉద్యోగాలను వదులుకున్నారు. తాజా ఉత్తర్వుల మేరకు యూనివర్సిటీ క్యాంపస్ కళాశాలకు 15 మందిని, సుల్తాన్‌పూర్, జగిత్యాల, మంథని జేఎన్‌టీయూ కాలేజీలకు ముగ్గురు చొప్పున, పాలేరు, మహబూబాబాద్, వనపర్తి, సిరిసిల్ల జేఎన్‌టీయూ కాలేజీలకు ఇద్దరు చొప్పున జూనియర్ అసిస్టెంట్లను కేటాయించారు. మిగిలిన 16 మందికి యూనివర్సిటీలోని వివిధ డైరెక్టరేట్లలో పోస్టింగులు ఇచ్చారు. సుమారు మూడు దశాబ్దాల తర్వాత కొత్తగా జేఎన్‌టీయూలో జూనియర్ అసిస్టెంట్ల నియామకం చేపట్టడంతో ఉన్నతాధికారులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కాగా, ప్రతిష్టాత్మక జేఎన్‌టీయూలో జూనియర్ అసిస్టెంట్ ఉద్యోగం వచ్చినా 26 మంది జాయిన్ అయ్యేందుకు విముఖంగా ఉండడానికి కారణాలేమిటో ఎవరికీ అంతుబట్టడం లేదు. కొత్తగా చేరిన జూనియర్ అసిస్టెంట్లకు వారిచ్చిన ఆప్షన్ల మేరకే వివిధ జేఎన్‌టీయూ విభాగాలు, కళాశాలల్లో పోస్టింగులు ఇచ్చినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు.





# డా. నాగం తిరుపతిరెడ్డి గారికి 50వ జన్మదిన శుభాకాంక్షలు

## స్ఫూర్తినిచ్చేలా నాగం తిరుపతిరెడ్డి 'విజన్'

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): డాక్టర్ నాగం తిరుపతిరెడ్డి తన ఆలోచనలకు అనుగుణంగా 2014లో 'విజన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్'ను ప్రారంభించారు. హైదరాబాద్ నగరానికి తలమానికమైన మాదాపూర్‌లోని అయ్యప్ప సొసైటీలో రియల్ ఎస్టేట్ కార్పొరేట్ ఆఫీస్‌లకే రోల్ మోడల్‌గా నిలిచేలా తన సంస్థ కేంద్ర కార్యాలయాన్ని తీర్చిదిద్దారు. ఈ కార్యాలయం నుంచి మొదటగా కొత్తూరులో విజన్ పారడైస్ వెంచర్ రూపుదిద్దుకుంది. భువనగిరిలో 'విజన్ కౌంటీ' ప్రజల మన్ననలను పొందింది.

**సేవా కార్యక్రమాలతో గౌరవ డాక్టరేట్..**

నాగం తిరుపతిరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ద్వారా చేస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన క్రిస్ట్ న్యూ టెస్టమెంట్ డీమ్డ్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టరేట్‌ను ప్రదానం చేశారు. దీంతో తన బాధ్యతను మరింత పెంచుకొని సేవా కార్యక్రమాలను విస్తరించారు. కాగా, డాక్టర్ నాగం తిరుపతి రెడ్డి ఏం చేసినా ఒక సంచలనమే అని చెప్పాలి. దక్షిణాది రాష్ట్రాల టీవీ కళాకారులచే ఎల్‌బీ స్టేడియంలో క్రికెట్ టోర్నమెంట్ ఏర్పాటు చేసి ఆయన అందరి దృష్టిని ఆకర్షించారు. హైదరాబాద్ మహానగరంతో పాటు మారుమూల గ్రామాల్లోనూ క్రీడాస్ఫూర్తిని పెంచాలనే ఉద్దేశంతో క్రికెట్ టోర్నమెంట్లు, ఎడ్ల పందేలు నిర్వహించడం పరిపాటి. విఘ్నేశ్వరుడి అనుగ్రహంతో 2017లో ప్రతిష్ఠాత్మకమైన బాలాపూర్ గణేశుడి లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకుని విఘ్నాలకు స్వస్తి పలికి విజయబావుటా ఎగురవేశారు.

**నిత్యం ఆధ్యాత్మిక కార్యక్రమాలు..**

అందరూ సుఖసంతోషాలతో నిత్యం బాగుండాలనే సంకల్పంతో ప్రతి మూడు నెలలకోసారి లోక కల్యాణార్థం యజ్ఞ యాగాలు నిర్వహించడం డాక్టర్ నాగం తిరుపతిరెడ్డి ఆధ్యాత్మిక చింతనకు నిదర్శనం. విజన్ గ్రూప్ ఆఫ్ కంపెనీస్ కేంద్ర కార్యాలయంలో ప్రతిరోజూ పండుగ వాతావరణమే ఉంటుంది. నిత్యం ఏదో ఒక కార్యక్రమంతో, అతిథులతో సందడి వాతావరణం నెలకొంటుంది. కొత్త వెంచర్‌ల బ్రోచర్ ఆవిష్కరణలు.. డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణలతో పాటు అన్ని పండుగలకు సెలబ్రేషన్స్. ఇలా ప్రతీ కార్యక్రమం ప్రత్యేకతను సంతరించుకుంటుంది.

## నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయం

- పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ





సీసీ రోడ్ల నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్

హైదర్‌నగర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ ఫేజ్-1, ఫేజ్-2 కాలనీల్లో రూ.42 లక్షల అంచనా వ్యయంతో నూతనంగా చేపట్టబోయే సీసీ రోడ్ల నిర్మాణ పనులకు దొడ్ల వెంకటేష్‌గౌడ్, పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ మంగళవారం శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ, ప్రజల సంక్షేమం, నియోజకవర్గం అభివృద్ధే ధ్యేయంగా పని చేస్తున్నామన్నారు. రోడ్ల పనులకు శంకుస్థాపన చేయడం సంతోషంగా ఉందన్నారు. నాణ్యత విషయంలో రాజీపడకుండా వేగంగా పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, కాలనీల వాసులు, కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

**క్రిస్మస్ శుభాకాంక్షలు..**

మియాపూర్, డిసెంబర్24 (ఆంధ్రజ్యోతి): శేరిలింగంపల్లి నియోజకవర్గ ప్రజలకు, క్రైస్తవులకు పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. ఎంతో పవిత్రమైన ఈ పండుగను భక్తిశ్రద్ధలతో ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. చర్చిల వద్ద ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు.





























# కూలిన నాలా పైకప్పు

● ప్రమాదాల బారిన ప్రజలు ● నాలుగు నెలలుగా నరకయాతన



ప్రమాదాలు జరగకుండా పైకప్పు కూలిన ప్రాంతంలో స్థానికులు ఏర్పాటు చేసిన బారికేడ్లు, శిథిలమైన రోడ్డుపై చేరిన నీరు

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** గాజులరామారం సర్కిల్ పరిధిలో ఇంజనీరింగ్ అధికారుల నిర్లక్ష్యం కొట్టొచ్చినట్లుగా కనిపిస్తోంది. రొడామేస్త్రీనగర్ హైటెన్షన్ లైన్ నుంచి వల్లభాయి పటేల్‌నగర్‌కు వెళ్లే చౌరస్తాలో పై కాలనీ నుంచి వచ్చే మురుగంతా వెళ్లడానికి నాలా ఉంది. ఈ రోడ్డు మీదుగా శ్రీరాంనగర్, బేకరిగడ్డ తదితర కాలనీలకు ఎక్కువ మంది రాకపోకలు సాగిస్తుంటారు. నాలుగు నెలల క్రితం రాయల్ స్టార్ స్కూల్ ఎదురుగా గల నాలా పైకప్పు శిథిలమై కూలిపోయింది. ప్రతీరోజు ఇక్కడి నుంచి వెళ్లే ప్రయాణికులు, వాహనదారులు ఆ గుంతలోంచి వెళ్తూ ప్రమాదాల బారిన పడుతున్నారు. వారం రోజుల క్రితం శ్రీరాంనగర్‌కు చెందిన ఓ వృద్ధుడు ఆ గుంతలో పడిపోయాడు. ప్రమాదం జరిగిన సమయంలో స్థానికులే ఒక బారికేడ్‌ను ఏర్పాటు చేశారు. ఆ గుంతలో ఎక్కువగా మురుగు వచ్చినప్పుడు పొంగి బయటకు రావడంతో రోడ్డు కూడా శిథిలమై గుంతలమయంగా మారింది. ఈ గుంత కారణంగా ప్రతీరోజు వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు.

### ఎవరూ పట్టించుకోవడం లేదు



మా కాలనీలో సమస్యలు తీవ్రంగా ఉన్నాయి. నాలా పైకప్పు కూలిపోయి నాలుగు నెలలు దాటింది. కళ్లు సరిగా కనిపించని ఓ ముసలాయన అందులో పడి ప్రమాదానికి గురయ్యాడు. లీడర్లు, అధికారులు పట్టించుకోవడం లేదు. ప్రాణాలు పోతేనే స్పందిస్తారా..?

\- మొయిన్, స్థానికుడు

### కనిపించని పాలకులు, అధికారులు

ఎన్నికల సమయంలో ఓట్ల కోసం మాత్రమే తమ ప్రాంతానికి నాయకులు వస్తారని, సమస్యలు ఉన్నప్పుడు ఎవరూ రావడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఓట్ల కోసం తప్పా తమ బస్తీకి కార్పొరేటర్ ఒక్కసారి కూడా రాలేదని, అధికారులు కూడా రావడం లేదని వాపోయారు. సంబంధిత అధికారులు స్పందించి నాలా పైకప్పుకు మరమ్మతులు చేయించాలని ప్రజలు కోరుతున్నారు.



రహదారి పక్కనే తవ్వి వదిలేసిన గుంత

## గుంతతో పొంచి ఉన్న ప్రమాదం

**పేట్‌బషీరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** కొంపల్లి మున్సిపల్ సర్వీస్ రోడ్డు నుంచి గుండ్లపోచంపల్లికి పోయే దారిలో అపర్ణ ఫామ్ గ్రో వద్ద ఉన్న పెద్ద గుంత ప్రమాదకరంగా మారింది. గతంలో కురిసిన వర్షాలకు మొగుళ్లకుంట నుంచి వచ్చే వర్షపు నీరు నాలాలో ఉన్న కాంక్రీట్‌ను తొలగించి, నీరు పోయేలా చేసిన మున్సిపల్ అధికారులు ఆ గుంతను పూడ్చక పోవడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. 24 గంటలు రద్దీగా ఉండే ఈ సర్వీస్ రోడ్డులో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని స్థానికులు, ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



మాజీ ఎమ్మెల్యేను కలిసిన సూపర్ మ్యాక్స్ కార్మికులు

## సూపర్ మ్యాక్స్ కార్మికుల బకాయిలు రాబట్టాలి

**జీడిమెట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** జీడిమెట్ల పారిశ్రామికవాడలోని సూపర్‌మ్యాక్స్ కార్మికులకు న్యాయబద్ధంగా రావాల్సిన బకాయిలను రాబట్టాలని మాజీ ఎమ్మెల్యే, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ నాయకులు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. జీడిమెట్ల సూపర్ మ్యాక్స్ కంపెనీలో 1050 మంది కార్మికులకు రెండు సంవత్సరాలుగా రావాల్సిన బకాయిలు చెల్లించలేదని తెలిపారు. పరిశ్రమను అర్ధాంతరంగా మూసివేయడంతో 40 మంది కార్మికులు ఆత్మహత్య చేసుకున్నారని తెలిపారు. పీఎఫ్ అంతరాయం కారణంగా కార్మికులు మరో ఫ్యాక్టరీలో చేరలేని పరిస్థితి ఉందని కూన శ్రీశైలంగౌడ్‌కు కార్మికులు విన్నవించుకున్నారు. శ్రీశైలంగౌడ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రితో కలిసి కార్మికుల సమస్యలను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. కూనను కలిసిన వారిలో కార్మిక సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, దయాకర్, కవిత, శ్రీను, రామచంద్రారెడ్డి, భరద్వాజ్, గణపతి, రాజు పాల్గొన్నారు.



నూతన వేతన ఒప్పందాన్ని అందుకుంటున్న నాగరాజు

## థర్మోకేబుల్స్ కార్మికులకు నూతన వేతన ఒప్పందం

**జీడిమెట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** జీడిమెట్ల పారిశ్రామికవాడలోని థర్మోకేబుల్స్ కంపెనీలోని కార్మికులకు నూతన వేతన ఒప్పందం జరిగింది. డిప్యూటీ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్యాంసుందర్‌రాజు సమక్షంలో ఈ ఒప్పందం చేసుకున్నారు. మూడు సంవత్సరాలకు గాను 10 వేల రూపాయలు, ముగ్గురు కాంట్రాక్టు కార్మికులను రెగ్యులరైజ్ చేసినట్లు తెలిపారు. సంవత్సరానికి రెండు జతల బట్టలు, బూట్లు, టూర్ అలవెన్సు, ఒక నెల జీతం బోనస్, షిఫ్ట్‌అలవెన్స్, వీడియోపాయింట్ ఇస్తామని కంపెనీ యాజమాన్యం, కార్మిక నాయకుడు చింతల నాగరాజుకు మధ్య ఒప్పందం జరిగినట్లు తెలిపారు. కార్మికులు, యాజాన్యాలు సత్సంబంధం కలిగి ఉండాలని నాగరాజు సూచించారు. ఈ కార్యక్రమంలో కంపెనీ వైస్ ప్రెసిడెంట్ రమేష్‌వర్మ, మనోహర్, అగర్వాల్, ఫిలిప్స్ వెంకటరెడ్డి, మచన్‌ఖాన్, భాస్కర్‌రెడ్డి, సిహెచ్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.



ఉపకమిషనర్‌కు వినతి పత్రం అందిస్తున్న శేఖర్‌యాదవ్

## జగద్గిరిగుట్ట డివిజన్‌లో సమస్యలను పరిష్కరించండి

**జీడిమెట్ల, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** జగద్గిరిగుట్ట డివిజన్ పరిధిలోని పలు బస్తీలలో ప్రజలు ఎదుర్కొంటున్న మౌలిక సదుపాయాలను కల్పించాలని బీజేపీ డివిజన్ అధ్యక్షుడు పున్నారెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులు శేఖర్‌యాదవ్ గాజులరామారం సర్కిల్ ఉపకమిషనర్ మల్లారెడ్డికి ప్రజావాణిలో వినతిపత్రం అందించారు. సర్వేనెంబర్ 348/1లో గల శ్రీలక్ష్మీ వేంకటేశ్వరస్వామి ఆలయం స్థలాలు కబ్జాకు గురవుతున్నాయని, వాటిని పరిరక్షించాలని, అదే విధంగా పలుబస్తీలలో రోడ్లు సరిగ్గా లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని, ప్రభుత్వ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇచ్చినట్లు తెలిపారు. వాటికి ఇంటి నెంబర్లు ఇవ్వాలని, రాజీవ్‌గృహకల్పలో పార్కును అభివృద్ధి చేయాలని కోరారు.



ఫుట్‌పాత్‌ను తవ్వుతున్న దృశ్యం

## ఎన్‌ఎల్బీనగర్‌లో ఫుట్‌పాత్ ధ్వంసం

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** గాజులరామారం సర్కిల్ చింతల్ డివిజన్ పరిధిలో లక్షలు ఖర్చుచేసి నిర్మించిన ఫుట్‌పాత్‌లను ధ్వంసం చేస్తున్నారు. అక్కడక్కడ చిరు వ్యాపారాలు చేసుకోవడం వరకు మాత్రమే ఇప్పటి వరకు చూశాం. కానీ, మంగళవారం న్యూలాల్ బహదూర్‌నగర్ (ఎన్‌ఎల్బీనగర్) బస్టాండ్ సమీపంలో ఓ ఇంటి యజమాని ఎలాంటి అనుమతి తీసుకోకుండా ఫుట్‌పాత్‌ను తవ్వించి పైప్‌లైన్ నిర్మాణ పనులు చేయడం గమనార్హం. ఇలా ఫుట్‌పాత్‌ను ధ్వంసం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని పాదచారులు కోరుతున్నారు.




వాల్వ్ వద్ద ఏర్పడిన లీకేజీ, రోడ్డుపై పారుతున్న తాగునీరు

## వాల్వ్ లీకై తాగునీరు వృథా

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** గాజులరామారం సర్కిల్ పరిధిలోని రొడామేస్త్రీనగర్‌లో తాగునీరు వృథాగా పోతుంది. ఇంటి నెంబర్ 56-59 సమీపంలో తాగునీటి మ్యాన్‌హోల్ వాల్వ్ వద్ద నీరు లీకవుతోంది. తాగునీటి సరఫరా చేసిన ప్రతీసారి ఇలాగే అవుతుందని స్థానికులు చెబుతున్నారు. లీకవుతున్న నీరంతా రోడ్లపై పారుతుండడంతో రోడ్డు కూడా గుంతలుగా మారే అవకాశముందని, అధికారులు స్పందించి మరమ్మతులు చేయించి నీటి వృథాను అరికట్టాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## డొమెస్టిక్ సిలిండర్ల దుర్వినియోగం



సుదర్శన్‌రెడ్డినగర్‌లో ఓ టీ స్టాల్‌లో ఉపయోగిస్తున్న డొమెస్టిక్ గ్యాస్

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి):** కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్ల దందా జోరుగా సాగుతోంది. ప్రధానంగా హోటళ్లు, టీ, టిఫిన్ సెంటర్ల నిర్వాహకులు గ్యాస్ ఏజెన్సీల నిర్వాహకులను మచ్చిక చేసుకుని అదనంగా డబ్బులు ఇస్తూ సిలిండర్లను కొంటున్నారని తెలుస్తోంది. ఒక్కో సిలిండర్‌ను రూ.1150 నుంచి రూ.1500 పైచిలుకు ధర పెట్టి కొనుగోలు చేస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి అక్రమదందాకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

● **దాడులు చేస్తాం**

బాలానగర్ పౌరసరఫరాల శాఖ అధికారి కళ్యాణ్‌ను వివరణ కోరగా.. డొమెస్టిక్ గ్యాస్ సిలిండర్లను ఎట్టి పరిస్థితిలోనూ వ్యాపారాల కోసం ఉపయోగించొద్దు. అలాంటిదేమైనా ఉంటే ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి చర్యలు తీసుకుంటాం.

## డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లలో సౌకర్యాలు కల్పించాలి



అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేపీ వివేకానంద్

**పేట్‌బషీరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** డబుల్‌బెడ్ రూమ్ ఇళ్లల్లో తాగునీటి, విద్యుత్ సదుపాయం, రోడ్డు పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఎమ్మెల్యే కేపీ వివేకానంద్ అధికారులను ఆదేశించారు. జీడిమెట్ల డివిజన్‌లోని పేట్‌బషీరా బాద్ ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో మంగళవారం ఆయన హౌసింగ్ బోర్డు, విద్యుత్‌శాఖ, జీహెచ్‌ఎంసీ అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని దుండిగల్, డీ పోచంపల్లి, బహదూర్‌పల్లి, బాచుపల్లిలో డబుల్‌బెడ్‌రూమ్ ఇళ్లలో పూర్తి కాని పనులను త్వరితగతిన చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కృష్ణయాదవ్, విజయ్‌శ్రీనివాస్, గోపాల్‌రెడ్డి, నాయకులు శ్రీను, కృష్ణ, రవీందర్‌యాదవ్, హౌసింగ్ బోర్డు పీవీ రవీందర్, డీఈలు మారుతీ, నర్సయ్య, విద్యుత్ డీఈఈ సత్తెమ్మ, ఏఈ రమేష్, జీహెచ్‌ఎంసీ ఈఈ లక్ష్మీ గణేష్, డీఈ పాపమ్మ, ఏఈ సురేందర్‌నాయక్ పాల్గొన్నారు.

### నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**పేట్‌బషీరాబాద్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** కొంపల్లి సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా నేడు విద్యుత్ ఉండదని ఏఈ శ్రీనివాసులు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు రాయల్‌పాక్, అశ్విని కాలనీ, కొంపల్లి గ్రామం, సెంట్రల్ పార్కు, బొబ్బిలి అపార్టుమెంట్స్ దేవి హోమ్స్, ప్రజయ్‌వెన్‌సాయి అపార్టుమెంట్స్, కేవీఆర్ రోడ్డు, గార్డెన్ సొసైటీ రోడ్డు, ఉమామహేశ్వరి కాలనీ, జయభేరి, బ్యాక్ కాలనీ, జయభేరి శివాలయం రోడ్డు, శ్రీనివాస్‌కాలనీల్లో విద్యుత్ ఉండదని వినియోగదారులు గుర్తించి సహకరించాలన్నారు.



అధికారులకు వినతిపత్రం ఇస్తున్న బీజేపీ నాయకులు

## ప్రభుత్వభూమిని స్వాధీనం చేసుకోవాలి

**దుండిగల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** సూరారంలోని సర్వే నంబరు 166, 167ల్లో ప్రభుత్వ భూమిని సీఎంఆర్ స్కూల్ యాజమాన్యం ఆక్రమించుకొని, చిన్న నిర్మాణాలు, బస్సు పార్కింగ్, ప్లే గ్రౌండ్ కోసం వాడుకుంటున్నారని కుత్బుల్లాపూర్ మండల అధికారులకు బీజేపీ నాయకులు ఫిర్యాదు చేశారు. దీనిపై అప్పటి కుత్బుల్లాపూర్ తహశీల్దార్, మేడ్చల్ జిల్లా కలెక్టర్లు నోటీసులు జారీ చేశారని, ఆక్రమించిన స్థలాన్ని కాపాడి, ప్రజావసరాలకు వినియోగించాలని కోరారు. ఈకార్యక్రమంలో బీజేపీ నాయకులు నల్ల జయశంకర్, చందూ, శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.



సెమీ క్రిస్మస్ సందర్భంగా కుత్బుల్లాపూర్ గ్రామంలోని సీపీఆర్ కాలనీలో నిర్వహించిన వేడుకలకు యువ నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షులు కేపీ విశాల్‌గౌడ్ హాజరై కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. జీడిమెట్ల డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు విల్సన్, పాస్టర్లు శ్యాంబాబు, మైకెల్, రాజు, ఆనంద్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.



### ఫంక్షన్ హాల్ నిర్మించాలి

బాలయ్య బస్తీలో ఫంక్షన్ హాల్ నిర్మాణానికి కృషి చేయాలని అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే కేపీ వివేకానంద్‌కు వినతిపత్రం అందజేశారు. అలాగే బస్తీలో మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. - గాజులరామారం (ఆంధ్రజ్యోతి)

## హత్య కేసులో ఇద్దరు నిందితుల రిమాండ్

**దుండిగల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** ఈనెల 21న తమ్ముడిని హత్య చేసిన నిందితులను దుండిగల్ పోలీసులు అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించారు. మేడ్చల్ జోన్ డీసీపీ కోటిరెడ్డి ఏసీపీ శ్రీనివాస్‌రెడ్డితో కలిసి దుండిగల్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. మెదక్ జిల్లా, కౌడిపల్లి మండలం, రాయిలాపూర్ గ్రామానికి చెందిన సంతోష్‌గౌడ్(32) బతుకుదెరువు కోసం వలసవచ్చి, కుత్బుల్లాపూర్ వెంకటేశ్వరనగర్‌లో నివాసం ఉంటూ మేడ్చల్ ఆర్టీఏ కార్యాలయంలో ఏజంట్‌గా పని చేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన మన్నె శేఖర్(34) ఆటో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. అయితే సంతోష్‌గౌడ్ తన తమ్ముడు సందీప్‌గౌడ్(30)ను మన్నె శేఖర్‌తో కలిసి ఈనెల 21న బహదూర్‌పల్లిలోని సాయినాథ్ సొసైటీ కమ్మ సంఘం ప్రాంతంలో హత్య చేసి పారిపోయారు. కుటుంబసభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని ఇద్దరు నిందితులను పట్టుకొన్నారు. వారి నుంచి బైక్, ఆటో, ఒక సుత్తె, రెండు ఫోన్‌లను స్వాధీనం చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐ సతీష్, ఎస్ఐ శంకర్, పోలీసులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల తనిఖీ



అధ్యాపకులతో మాట్లాడుతున్న విద్యాధికారి కిషన్

**దుండిగల్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** కుత్బుల్లాపూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను మేడ్చల్, మల్కాజ్‌గిరి జిల్లా విద్యాధికారి కిషన్ మంగళవారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఆయన మాట్లాడి, అధ్యాపకులకు తగిన సూచనలు, సలహాలు ఇచ్చారు. అత్యధిక ఉత్తీర్ణత శాతం సాధించేలా విద్యార్థులకు శిక్షణ ఇవ్వాలని అధ్యాపకులకు సూచించారు. ఈ కార్య క్రమంలో కళాశాల ప్రిన్సిపల్ నాగేందర్ పాల్గొన్నారు.

## విద్యుదాఘాతంతో ఒకరి మృతి



ఆర్చీపై నుంచి మృతదేహాన్ని దించుతున్న స్థానికులు ఇన్‌సెట్‌లో వ్యక్తి మృతదేహం

**దుండిగల్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి):** మల్లంపేట్ కేవీఆర్ లేఅవుట్‌లో నూతనంగా నిర్మిస్తున్న కమాన్ నిర్మాణం పనుల వద్ద గుర్తు తెలియని వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. సంఘటన జరిగి ఇరవై నాలుగు గంటలు గడుస్తున్నా దుండిగల్ పోలీసులు గోప్యంగా ఉంచడంపై అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ కమాన్ నియోజకవర్గానికి చెందిన ఓ కాంగ్రెస్ పార్టీ నాయకుడి తండ్రి పేరు మీద నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దాదాపు 30-35 సంవత్సరాల వయస్సు కలిగిన గుర్తు తెలియని వ్యక్తి ఈనెల 23వతేది సాయంత్రం పొడవాటి ఐరన్ రాండ్ పట్టుకుని నిర్మిస్తున్న ఆర్చ్‌పైకి ఎక్కి పైన ఉన్న విద్యుత్ తీగలకు ఇనురాడ్డును అంటించాడు. విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. శవాన్ని దుండిగల్ పోలీసులు గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

# దాతలు స్పందిస్తే.. దత్తత ఇచ్చేస్తాం!

● జేఎన్‌టీయూ అనుబంధ కాలేజీల్లో దయనీయ పరిస్థితులు
● ఇన్‌చార్జి వైస్‌చాన్స్‌లర్ డాక్టర్ బాలకిష్టారెడ్డి
● ఫిబ్రవరి 8న జేఎన్‌టీయూ గ్లోబల్ అలూమ్ని మీట్
● 'జెగమ్-25' పోస్టర్‌ను ఆవిష్కరించిన ఉన్నతాధికారులు



పోస్టరును ఆవిష్కరిస్తున్న జేఎన్‌టీయూ ఇన్‌చార్జి వీసీ, రిజిస్ట్రార్, డైరెక్టర్ తదితరులు

**హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి):** దాతలు ముందుకొస్తే జేఎన్‌టీయూకు అనుబంధంగా ఉన్న ఇంజనీరింగ్ కాలేజీలను దత్తత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ఇన్‌చార్జి వీసీ డాక్టర్ బాలకిష్టారెడ్డి స్పష్టం చేశారు. ఫిబ్రవరిలో నిర్వహించనున్న జేఎన్‌టీయూ గ్లోబల్ మీట్ (జెగమ్-25)కు సంబంధించిన పోస్టరును మంగళవారం ఆయన ఆవిష్కరించారు. అనంతరం ఇన్‌చార్జి వీసీ మాట్లాడుతూ.. గత పదేళ్లలో అప్పటి ప్రభుత్వం ఏర్పాటు చేసిన సిరిసిల్ల, వనపర్తి, మహబూబాబాద్, పాలేరు జేఎన్‌టీయూ కాలేజీలు దయనీయ పరిస్థితులు నెలకొన్నాయన్నారు. ఆయా కాలేజీల్లో తరగతి గదులు, హాస్టల్స్ వసతులు లేవన్నారు. ఈ కాలేజీలతో పాటు సుల్తాన్‌పూర్, మంథని జేఎన్‌టీయూ కాలేజీల్లోనూ పదేళ్లుగా బోధన, బోధనేతతర సిబ్బందిని నియమించకపోవడం, నిధులు మంజూరు చేయకపోవడంతో నిర్వహణ దుర్భరంగా మారిందని చెప్పారు.

### పూర్వ విద్యార్థులు ముందుకు వస్తే...

ప్రపంచవ్యాప్తంగా ఎన్నో దేశాల్లో స్థిరపడిన జేఎన్‌టీయూ పూర్వ విద్యార్థులు తమ స్వస్థలాలకు సమీపంలోని వర్సిటీ ఇంజనీరింగ్ కాలేజీల బాగు కోసం తోడ్పాటు అందించాలని కోరుతున్నట్లు ఇన్‌చార్జి వీసీ బాలకిష్టారెడ్డి పేర్కొన్నారు. 2023లో నిర్వహించిన గ్లోబల్ అలూమ్నీ మీట్‌కు పూర్వ విద్యార్థుల నుంచి మంచి స్పందన లభించిందని, హైదరాబాద్ జేఎన్‌టీయూ అభివృద్ధికి ఎంతోమంది ఇతోధికంగా విరాళాలు అందించారని చెప్పారు. రానున్న ఫిబ్రవరి 8, 9 తేదీల్లో జరిగే పూర్వ విద్యార్థుల సమ్మేళనం('జెగమ్-25' )లో అకడమిక్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (ఏఎస్ఆర్) కింద స్పందించిన దాతలకు ఆయా కాలేజీలను దత్తత ఇస్తామన్నారు. వర్సిటీ అనుబంధ కాలేజీల్లో అధ్యాపకుల కొరతకు ప్రత్యామ్నాయంగా జేఎన్‌టీయూ హైదరాబాద్ ప్రొఫెసర్లతో ఆన్‌లైన్ తరగతులను నిర్వహిస్తామన్నారు. ఇందుకోసం ఏర్పాటు చేసిన ఈ-కంటెంట్ స్టూడియోను సమర్థవంతంగా వినియోగించుకోవాలని ఆదేశించారు.

### జెగమ్ నిర్వహణతో గ్లోబల్ కనెక్టివిటీ

ప్రపంచవ్యాప్తంగా ఉన్న పూర్వ విద్యార్థుల మధ్య కనెక్టివిటీని పెంచేందుకు గ్లోబల్ అలుమ్ని మీట్ దోహదపడుతుందని అలూమ్ని విభాగం డైరెక్టర్ జె.సురేశ్‌కుమార్ వెల్లడించారు. విద్యాభివృద్ధి, గ్లోబల్ కనెక్టివిటీ, సామాజిక సేవలపై ఆసక్తికర చర్చలకు జెగమ్-25 మంచి వేదిక కానుందన్నారు. వివిధ దేశాల్లో ఉంటున్న పూర్వ విద్యార్థులతో మంచి సంబంధాలు కలిగి ఉండి.. శాస్త్రీయ పరిశోధన, ప్రాజెక్టుల అభివృద్ధిలో వారి సహకారం తీసుకుంటామన్నారు. గతేడాది రిజిస్ట్రేషన్లు 5వేలు ఉండగా, ఈ ఏడాది పూర్వవిద్యార్థుల రిజిస్ట్రేషన్లు 18 వేలకు పెరిగాయన్నారు. సాంకేతికత ద్వారా యూనివర్సిటీని అంతర్జాతీయంగా ప్రమోట్ చేయడం, జేఎన్‌టీయూ కాలేజీల విద్యార్థులకు శిక్షణ, ప్లేస్‌మెంట్ అవకాశాలను మెరుగుపరచడం, ఇతర దేశాలకు చెందిన విద్యాసంస్థలతో అంతర్జాతీయ అవగాహన ఒప్పందాలను కుదుర్చుకోవడం జెగమ్-25 ప్రధాన లక్ష్యాలని డైరెక్టర్ సురేశ్‌కుమార్ తెలిపారు. పోస్టరు ఆవిష్కరణ కార్యక్రమంలో రిజిస్ట్రార్ వెంకటేశ్వర రావు, ప్రిన్సిపాల్స్ నర్సింహారెడ్డి, సింధు, డిప్యూటీ డైరెక్టర్ క్రాంతికిరణ్, అసిస్టెంట్ డైరెక్టర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

## ప్రమాదకరంగా విద్యుత్ స్తంభాలు



రొడామేస్త్రీనగర్ హైటెన్షన్ లైన్‌లో వంగిన స్తంభం

**కుత్బుల్లాపూర్, డిసెంబరు 24 (ఆంధ్ర జ్యోతి):** గాజులరామారం సర్కిల్ పరిధిలోని వివిధ కాలనీల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాదకరంగా మారాయి. చింతల్ డివిజన్ పరిధిలోని రొడామేస్త్రీ నగర్ ఇంటి నెంబర్ 16-9 సమీపంలోని రోడ్డు మధ్యన, హైటెన్షన్ లైన్ విద్యుత్ స్తంభాలు ఒక పక్కకు వంగిపోయి ప్రమాదకరంగా మారింది. తీగల మీద ఆధారపడి ఉన్నాయి. భారీగా గాలులు వీస్తే కూలిపోయే ప్రమాదముందని విద్యుత్ అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకముందే కొత్త విద్యుత్ స్తంభాలను ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

## కుమార్తె మృతితో తీరని శోకం


శివానీ(ఫైల్)

రాయదుర్గం, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నాలుగు నెలల్లో ఉద్యోగంలో చేరాల్సిన ఏకైక కుమార్తె రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరవుతున్నారు. వివరాల్లోకి వెళ్తే.. కామారెడ్డి జిల్లా దోమకొండకు చెందిన ఐరేని నర్సయ్య దంపతులు గ్రామంలో చిన్న హోటల్ నడుపుకుంటూ జీవనం సాగిస్తున్నారు. వీరి ఏకైక కుమార్తె శివానీ(21) గండిపేట సీబీఐటీలో బీటెక్ నాలుగో సంవత్సరం చదువుతుంది. గండిపేటలోనే పెయింగ్ గెస్ట్‌గా ఉంటోంది. ఈ మధ్యకాలంలో జరిగిన క్యాంపస్ ప్లేస్‌మెంట్‌లో ఓ మల్టీనేషనల్ కంపెనీలో ఉద్యోగం దక్కించుకుంది. ఇంకో నాలుగు నెలల్లో ఉద్యోగంలో చేరాల్సి ఉంది. నిజాంసాగర్‌లో తాను చదివిన పాఠశాల పూర్వవిద్యార్థుల సమ్మేళనం ఆదివారం నిర్వహించగా ఆ కార్యక్రమానికి హాజరై స్నేహితులతో ఎంతో ఉత్సాహంగా గడిపింది. తిరిగి హైదరాబాద్‌కు చేరుకుని జేఎన్‌టీయూ వద్ద బస్సు దిగిన శివాని గండిపేటలోని తన సీనియర్ విద్యార్థి, సాఫ్ట్‌వేర్ ఉద్యోగి వెంకట్‌రెడ్డి బైక్‌పై గండిపేటకు బయలుదేరారు. అర్ధరాత్రి 1.50 గంటల సమయంలో నానక్‌రాంగూడ రోటరీ సమీపంలో వేగంగా దూసుకొచ్చిన కారు బైక్‌ను ఢీకొట్టింది. దీంతో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. వారిని కొండాపూర్ జిల్లా ఆస్పత్రికి తరలించగా శివానీ మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. వెంకట్‌రెడ్డి పరిస్థితి విషమంగా ఉన్నట్లు ఎస్సై ప్రణయ్‌తేజ్ తెలిపారు. ప్రమాదానికి కారకుడైన కారు డ్రైవర్ సాయికైలాష్(19)ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. కాగా, ఉద్యోగంలో చేరి తమ ఆర్థిక కష్టాలు తీరుస్తుందనుకున్న కుమార్తె రోడ్డు ప్రమాదంలో మృతి చెందడాన్ని తల్లిదండ్రులు జీర్ణించుకోలేకపోతున్నారు.

# తగ్గిన రోడ్డు ప్రమాదాలు..

- మరణించిన వారిలో పాదచారులు, ద్విచక్రవాహనదారులే ఎక్కువ
- వార్షిక నివేదికలో వెల్లడించిన సైబరాబాద్ సీపీ


(ఫైల్)

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు పాటించకపోవడం, అతివేగం, మద్యం తాగి వాహనాలు నడపడం వంటివి రోడ్డు ప్రమాదాలకు ప్రధాన కారణాలుగా ఉంటున్నాయని సైబరాబాద్ సీపీ అవినాష్ మహంతి తెలిపారు. జంక్షన్లు, రోడ్ల విస్తరణ, ఆక్రమణల తొలగింపు, నిబంధనలు పాటించని వారిపై చర్యలు తీసుకోవడం వల్ల గతేడాదితో పోల్చితే రోడ్డు ప్రమాదాల సంఖ్యతోపాటు మరణించిన వారి సంఖ్య కూడా తగ్గుముఖం పట్టిందన్నారు. గతేడాదిలో 3,036 రోడ్డు ప్రమాద కేసులు నమోదు కాగా, ఈ ఏడాదిలో 2,829 కేసులు నమోదయ్యాయన్నారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించి 805 కేసుల్లో మరణాలు సంభవించాయని, మరో 2,332 కేసుల్లో గాయాలయ్యాయని, మరో 692 కేసుల్లో ఎవరూ గాయపడలేదని తెలిపారు. రోడ్డు ప్రమాద ఘటనల్లో 261 మంది పాదచారులు, 10 మంది సైక్లిస్టులు, 465 మంది ద్విచక్ర వాహనదారులు, 27 మంది ఆటో, ట్రాలీ డ్రైవర్లు, 53 మంది కార్లు నడిపేవారు, 26 మంది భారీ వాహనాలు నడిపేవారు ప్రాణాలు కోల్పోయారని తెలిపారు. వాహనం అదుపుతప్పిన ఘటనల్లో 225 మంది ప్రాణాలు కోల్పోయారన్నారు. డ్రంకెన్ డ్రైవ్, రాంగ్ సైడ్ డ్రైవింగ్, నిర్లక్ష్య డ్రైవింగ్, సిగ్నల్ జంప్, హెల్మెట్ లెస్ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనపై ప్రత్యేక డ్రైవ్‌లు చేశామని, నిబంధనలు పాటించని వారిపై చలాన్లు విధించడంతోపాటు కేసులు నమోదు చేశామన్నారు. ఈ ఏడాదిలో 6,85,545 స్పాట్ చలాన్లు, 15,74,997 ఈ చలాన్లు నమోదు చేశామని, నిబంధనలు పాటించని వాహనదారులకు చలాన్ల రూపంలో రూ.111.81 కోట్ల జరిమానాలు విధించామన్నారు. ఉల్లంఘనులకు చెందిన 7181 డ్రైవింగ్ లైసెన్స్‌లు సస్పెండ్ చేశామన్నారు.

### రోడ్లపై జరిగిన ప్రమాదాలు

| రహదారులు | మృతులు | గాయపడిన వారు | మొత్తం |
|---|---|---|---|
| జాతీయ, రాష్ట్ర రహదారులు | 280 | 1008 | 1288 |
| ఔటర్ రింగ్ రోడ్డు | 43 | 135 | 178 |
| పీవీ ఎక్స్‌ప్రెస్‌వే | 1 | 4 | 5 |
| జీహెచ్‌ఎంసీ రోడ్లు | 56 | 307 | 363 |
| ఆర్ అండ్ బీ రోడ్లు | 225 | 581 | 806 |
| ఇతర రోడ్లు | 200 | 989 | 1189 |

### రోడ్ల విస్తరణకు ప్రణాళికలు

ఐటీ కారిడార్‌లో వాహనాల రద్దీ ఎక్కువగా ఉన్న కారణంగా తరచూ ట్రాఫిక్‌జామ్ సమస్య తలెత్తుతుంది. ఈ సమస్యను పరిష్కరించడానికి జీహెచ్‌ఎంసీ, విద్యుత్, వాటర్‌వర్క్స్ అధికారులతో సమన్వయం చేసుకొని సైబర్ టవర్స్ నుంచి కేపీహెచ్‌బీ వరకు రెండు వైపులా రోడ్డు విస్తరణ పనులు చేస్తున్నామని సీపీ తెలిపారు. ట్రిపుల్‌ఐటీ జంక్షన్ విస్తరణ, రోడ్లపై ఆక్రమణలు తొలగించడం, ఉల్లంఘనలపై ప్రత్యేక డ్రైవ్‌లు చేయడం ద్వారా ప్రమాదాలు తగ్గించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నామని తెలిపారు.

## సికింద్రాబాద్-ముజాఫర్‌పూర్ మధ్య వీక్లీ స్పెషల్స్

- జనవరి 7నుంచి ప్రయాణికులకు అందుబాటులో రైళ్లు

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్-ముజాఫర్‌పూర్ మార్గంలో జనవరి 7నుంచి తదుపరి ఉత్తర్వులు ఇచ్చే వరకు(కొద్దిరోజులు మినహా)వీక్లీ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు దక్షిణమధ్యరైల్వే ప్రకటించింది. ముజాఫర్‌పూర్ నుంచి సికింద్రాబాద్‌కు జనవరి 7 నుంచి ప్రతీ బుధవారం, సికింద్రాబాద్ నుంచి ముజాఫర్‌పూర్‌కు ఈనెల 9 నుంచి ప్రతీ శుక్రవారం రైళ్లు నడుస్తాయని సీపీఆర్‌ఓ శ్రీధర్ తెలిపారు. జనవరి 14 నుంచి ఫిబ్రవరి 27 మధ్య మాత్రమే ఈ ప్రత్యేక రైళ్లు ప్రయాణికులకు అందుబాటులో ఉండవని వెల్లడించారు. కాగా, మార్గమధ్యలో ఖాజీపేట్, పెద్దపల్లి, రామగుండం, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, బలార్ష, నాగ్‌పూర్, ఇటార్సి, నర్సింగపూర్, జబల్‌పూర్, ఉపాధ్యాయ, ధనపూర్ తదితర స్టేషన్లలో ప్రత్యేక రైళ్లకు హాల్ట్ కల్పించినట్లు సీపీఆర్‌వో పేర్కొన్నారు.

## రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై దాడి

- అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తుండగా ఘటన


గాయపడిన ఆర్‌ఐ రమేష్


కూల్చివేతలు నిర్వహిస్తున్న అధికారులు

బిట్స్‌పిలానీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసేందుకు వచ్చిన రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌పై కొందరు అక్రమార్కులు దాడి చేశారు. ఈ సంఘటన మంగళవారం జవహర్‌నగర్ కార్పొరేషన్ పరిధిలోని దేవేందర్‌నగర్‌లో జరిగింది. రెవెన్యూ సిబ్బంది తెలిపిన వివరాల ప్రకారం.. జవహర్‌నగర్ రెవెన్యూ పరిధి దేవేందర్‌నగర్‌లోని సర్వేనెంబర్.645, 646, 655లో ప్రభుత్వ భూములను కొందరు అక్రమార్కులు దర్జాగా కబ్జాచేసి యథేచ్ఛగా అక్రమ నిర్మాణాలు చేపట్టారు. వీటిపై కొందరు స్థానికులు మండల రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. కాప్రా తహసీల్దార్ సుచరిత ఆదేశాల మేరకు రెవెన్యూ అధికారులు, సిబ్బంది పోలీసుల సహాయంతో మంగళవారం అక్రమ నిర్మాణాల కూల్చివేతలు చేపట్టారు. ఈ క్రమంలో కొందరు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రమేష్‌పై దాడి చేసి గాయపరిచారు. దీంతో రెవెన్యూ సిబ్బంది ఆర్‌ఐని ఆస్పత్రికి తరలించారు. అనంతరం ఆర్‌ఐ జవహర్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇరుగదిండ్ల వెంకటేష్, రాపోలోళ్ల రాజు, వడ్డెర శ్రీనుతో పాటు మరో ముగ్గురు గుర్తు తెలియని మహిళలపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ సైదయ్య తెలిపారు.

### దాడి హేయనీయం

ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను కూల్చివేయిస్తున్న ఆర్‌ఐ రమేష్‌పై అక్రమార్కులు దాడికి పాల్పడడం హేయనీయమని తహసీల్దార్ సుచరిత పేర్కొన్నారు. టీజీటీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాములు, కార్యదర్శి పూల్‌సింగ్, ప్రధాన కార్యదర్శి పాక రమేష్, టీజీఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాంరెడ్డి, ప్రధాన కార్యదర్శి బిక్షం, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రాజేష్, కార్యదర్శి హసినా ఆర్‌ఐపై దాడిని ఖండించారు. దాడి చేసిన వారిపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.


కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్సీ కోదండరాం, రచయిత అందెశ్రీ తదితరులు

## ఉద్యమకారులకు సన్మానం

గచ్చిబౌలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): గచ్చిబౌలిలోని టీఎన్‌జీఓ కాలనీలో ప్రభుత్వ మహిళా పెన్షనర్ల ఫోరం ఆధ్వర్యంలో తెలంగాణ ఉద్యమంలో ప్రముఖ పాత్ర పోషించిన కవులు, గేయ రచయితలకు సన్మాన కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ కోదండరాం, ప్రముఖ రచయిత అందెశ్రీ, ప్రముఖ పాత్రికేయులు పాశం యాదగిరితో పాటు పలువురు హాజరయ్యారు. ఈ సందర్భంగా కోదండరాం మాట్లాడుతూ, ఉద్యోగులకు, పెన్షనర్లకు నగదు రహిత వైద్య పథకం అమలు అయ్యే విధంగా సిఫారసు చేస్తామని హామీ ఇచ్చారు. అందెశ్రీ మాట్లాడుతూ, మనం ఏ ఉద్దేశంతో తెలంగాణను సాధించుకొన్నామో దానికి విరుద్ధంగా పదేళ్ల పాటు మోసగించబడ్డామన్నారు. తెలంగాణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన అమరుల కుటుంబాలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం ఫోరం ప్రతినిధులు వీరిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ప్రముఖ కవి జయరాజ, శిల్పి యాదగిరిరావు, ఆర్గనైజర్స్ ఆర్.ఉమాదేవి, నాగమాంబ, కె.ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## బిల్డర్‌ను బెదిరించిన కేసులో రిపోర్టర్ అరెస్టు

హైదర్‌నగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): అక్రమ నిర్మాణం కడుతున్నారంటూ ఓ బిల్డర్‌ను బెదిరించిన కేసులో విలేకరిని కేపీహెచ్‌బీ పోలీసులు మంగళవారం అరెస్టు చేశారు. కేపీహెచ్‌బీ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ ఫేజ్-7లోని ఎంఐజీ 43లో పవన్‌కుమార్ అనే వ్యక్తి భవనం నిర్మిస్తున్నాడు. అక్కడికి రిపోర్టర్లమంటూ జంగాల నాగార్జున, బత్తిన సుమన్ గౌడ్ వెళ్లి చెరో రూ.లక్ష ఇవ్వాలని, లేదంటే జీహెచ్‌ఎంసీలో ఫిర్యాదు చేసి కూల్చివేయిస్తామని బెదిరించారని పవన్‌కుమార్ గత వారం కేపీహెచ్‌బీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు మంగళవారం జంగాల నాగార్జునను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. కాగా, మరో నిందితుడు బత్తిని సుమన్‌గౌడ్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

# నగరం యాదిలో శ్యాంబెనెగల్


- సికింద్రాబాద్ నుంచి సినిమా రంగంలోకి..
- సైకిల్, స్విమ్మింగ్‌ల్లో చాంపియన్
- హైదరాబాద్ రాష్ట్ర జూనియర్ స్విమ్మింగ్‌లో ట్రోఫీ గెలుచుకున్న బాల బెనెగల్

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): దేశం గర్వించదగ్గ దర్శక దిగ్గజం శ్యామ్‌బెనెగల్. భారతీయ సినీవినీలాకాశంలో ధ్రువతారగా వెలుగొందిన ఆయన పుట్టి, పెరిగింది సికింద్రాబాద్‌లోనే.! ఈ నేల చరిత్ర, సంస్కృతి ఆయన సినిమాల ద్వారా ప్రపంచానికి పరిచయం అయ్యాయి.

శ్యామ్ తీసిన మొట్టమొదటి చిత్రం 'అంకుర్' యాప్రాల్‌కు చెందిన ఒక యువకుడి కథ ఇతివృత్తంగా సాగుతుంది. భూదాన్‌పోచంపల్లి చేనేత కార్మికుల జీవితాల ఆధారంగా 'సుస్మన్' సినిమాను వెండితెరపై నిలిపారు. 'మండి' చిత్రీకరణ హైదరాబాద్ పరిసరాల్లోనే సాగింది. ప్రఖ్యాత ఉర్దూ రచయిత్రి జిలానో బానో రాసిన 'నర్సయ్య కి బావ్డి' కథ ఆధారంగా 'వెల్ డన్ అబ్బ' సినిమా తీశారు. ఇలా ఒక్కమాటలో హైదరాబాద్ సంస్కృతిని, తెలంగాణ పల్లె జీవన చిత్రాన్ని ప్రపంచానికి పరిచయం చేసిన తొలి దర్శకుడు శ్యాంబెనెగల్ అని సినిమా విమర్శకులుసైతం కొనియాడతారు. కులీకుతుబ్‌షా కవిత్వాన్ని 'నిషాంత్' సినిమా పాటల ద్వారా వినవచ్చు. ఈ నేలపై ఆయనకున్న మమకారం అలాంటిదిమరి.!

### ఈతలో ఛాంపియన్..

ఫొటోగ్రఫీ, కళలు, సాహిత్యంపై చిన్నతనం నుంచి వల్లమాలిన ప్రేమ కలిగిన బెనెగల్ గజ ఈతగాడు అని కొద్ది మందికి మాత్రమే తెలుసు. ఫతే మైదానం(ప్రస్తుతం ఎల్బీస్టేడియం) ప్రాంగణంలోని హిమాయత్ స్విమ్మింగ్ పూల్‌లో బ్రిటీషు-నిజాం సైనికాధికారులకు, ఏడాదిలో ఒక నెలరోజులు ఆలియా బాలురు కళాశాల విద్యార్థులకు మాత్రమే ఆనాడు ప్రవేశం ఉండేది. అలా ఆలియాలో చదువుతున్న సమయంలో శ్యాం హిమాయత్ ఈత కొలనులో శిక్షణ పొందాడు. ఒక సందర్భంలో తన శిక్షకుడు జిలానీ పరీక్ పర్యవేక్షణలో ఆనాడు స్వచ్ఛతకు మారుపేరైన హుస్సేన్‌సాగర్‌లోనూ శ్యామ్‌బెనెగల్ ఈతకొట్టాడు. జూనియర్ కేటగిరీలో హైదరాబాద్ రాష్ట్రస్థాయి ఈతపోటీల్లో పాల్గొన్న శ్యాంబెనెగల్ ఛాంపియన్‌గా నిలిచాడు. ఈ విషయాన్ని 2015లో జిలానీ 'ఆంధ్రజ్యోతి'తో ప్రత్యేకంగా చెప్పారు. అంతేకాదు, 1951 నాటి అరుదైన చిత్రాన్ని అందించారు.


హుస్సేన్ సాగర్‌లో ఈత కొడుతున్న శ్యాంబెనెగల్



### అల్వాల్ నుంచి సైకిల్ ప్రయాణం..

శ్యాంబెనెగల్ నిజాం కళాశాలలో చదివారు. ఆయనకు సినీనటుడు శంకర్ మెల్కొటే మూడేళ్లు జూనియర్ అని ఒక సందర్భంలో చెప్పారు. ఆ పరిచయంతోనే మెల్కొటేకు 'నిశాంత్' సినిమాలో మొట్టమొదటి సారిగా నటించే అవకాశం లభించింది. శ్యాం అల్వాల్ నుంచి రోజూ సైకిల్‌మీద బషీర్‌బాగ్‌లోని నిజాం కళాశాలకు వెళ్లేవారు. కాలేజీ రోజుల్లో నిజాం కళాశాల కొలీజియం మ్యాగజైన్‌కు రెండేళ్లు ఎడిటర్‌గా కొనసాగారు. ఫిల్మ్‌క్లబ్‌ను కూడా నిర్వహించారు. చిన్నతనం నుంచి సినిమాలపై విపరీతమైన మక్కువ కలిగిన శ్యాంబెనెగల్.. బొల్లారం ప్రాంతంలోని 'ఆర్మీ కంటోన్మెంట్ థియేటర్'లో విడుదలైన ప్రతి సినిమా తప్పనిసరిగా చూసేవారు. అదీ ఆ థియేటర్ ఆపరేటర్ సహాయంతో! సికింద్రాబాద్‌లో పుట్టి, ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన శ్యాంబెనెగల్ ఇకలేరన్న వార్త నగరవాసులను శోకసంద్రంలో ముంచెత్తింది.


సర్వే నిర్వహిస్తున్న జీహెచ్ఎంసీ సిబ్బంది

## చందానగర్‌లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే

చందానగర్, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): చందానగర్ సర్కిల్ పరిధిలో ఇందిరమ్మ పథకంకు దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల సర్వే కొనసాగుతోంది. చందానగర్ సర్కిల్ పరిధిలో రెండు రోజుల నుంచి సర్వే కొనసాగుతుంది. ఈ సర్వే జనవరి 19వరకు జరుగుతుందని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. సర్కిల్ పరిధిలో 24,281 మంది ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకున్నారని చెప్పారు.


కేంద్ర మాజీ మంత్రి మల్లికార్జున్‌గౌడ్ సమాధి వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ, ఆయన కుటుంబ సభ్యులు

## కేంద్ర మాజీ మంత్రి మల్లికార్జున్‌గౌడ్‌కు నివాళి

గచ్చిబౌలి, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర మాజీ మంత్రి మల్లికార్జున్‌గౌడ్ వర్ధంతి సందర్భంగా ఆయన కుటుంబ సభ్యులతో కలిసి పీఏసీ చైర్మన్, ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నల్లగండ్లలోని ఆయన సమాధి వద్ద నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో మల్లికార్జున్‌గౌడ్ సతీమణి భాగ్యలక్ష్మి, ఆయన మిత్రుడు బీఎన్‌చారి, కార్పొరేటర్ వెంకటేష్‌గౌడ్ పాల్గొన్నారు. శేరిలింగంపల్లి కాంగ్రెస్ ఇన్‌చార్జి జగదీశ్వర్‌గౌడ్ కూడా పార్టీ నాయకులతో కలిసి మల్లికార్జున్‌గౌడ్ సమాధి వద్ద నివాళులు అర్పించారు.


దుప్పట్లు పంపిణీ చేస్తున్న సత్యనారాయణ సేవాసమితి ప్రతినిధులు

## పేదలకు దుప్పట్లు పంపిణీ

గచ్చిబౌలి, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): సత్యనారాయణ సేవా సమితి ఆధ్వర్యంలో పేదలకు దుప్పట్లను పంపిణీ చేశారు. లింగంపల్లి, చందానగర్, హఫీజ్‌పేట పరిధిలోని రైల్వేస్టేషన్లు, బస్టాప్‌ల వద్ద అభాగ్యులకు మంగళవారం దుప్పట్లు పంపిణీ చేశారు. భోజనం అందించారు. సేవాసమితి అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

## రూ.2.25 లక్షల మద్యం పట్టివేత

హైదరాబాద్ సిటీ, డిసెంబరు 24 (ఆంధ్రజ్యోతి): నూతన సంవత్సరం వేడుకల సందర్భంగా మద్యం అమ్మకాలు జరిపి సొమ్ము చేసుకోవాలని ప్రయత్నించిన అక్రమార్కులను సికింద్రాబాద్ ఎక్సైజ్ పోలీసులతో పాటు డీటీఎఫ్, టాస్క్‌ఫోర్స్ పోలీసులు పట్టుకున్నారు. వారి నుంచి రూ.2.25 లక్షల విలువ చేసే 76 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తెలంగాణ టూ ఢిల్లీ రైళ్లలో రంగారెడ్డి జిల్లాకు చెందిన మెట్టు సందీప్ అనే వ్యక్తి నుంచి 24 మద్యం బాటిళ్లను ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్నారు. ఈ మద్యం బాటిళ్లలో జానీవాకర్, రెడ్‌లేబుల్, బల్లేటైన్ లాంటి విలువైన ఈ మద్యం హర్యానా ప్రాంతానికి చెందినవిగా గుర్తించారు. డీటీఎఫ్ టీమ్ 46 మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకోగా.. జమ్ము కాశ్మీర్ సీఆర్‌పీఎఫ్ క్యాంటీన్‌కు చెందినవిగా గుర్తించారు. మరో టీమ్ ఆరు బాటిళ్లను పట్టుకున్నారు.

# శేరిలింగంపల్లికి క్రిస్మస్ శోభ


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న సినీనటి జయసుధ, సంకల్ప ఫౌండేషన్ ప్రతినిధులు


క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న దొడ్ల రామకృష్ణగౌడ్, పాస్టర్స్


చందానగర్, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): క్రిస్మస్ పర్వదినం పురస్కరించుకుని చందానగర్ సర్కిల్ పరిధిలోని పలు డివిజన్లలో క్రిస్మస్ వేడుకలకు చర్చిలు ముస్తాబయ్యాయి. మియాపూర్‌లోని కల్వరిటెంపుల్, పాపిరెడ్డినగర్, హుడాకాలనీ, ఆర్టీసీ కాలనీ, మదీనగూడ, రాయదుర్గం, గచ్చిబౌలి, శేరిలిగంపల్లి, పాపిరెడ్డికాలనీ, కొండాపూర్, మాదాపూర్‌లోని పలుకాలనీల్లో చర్చిలను రంగురంగు విద్యుత్ దీపాలతో అలంకరించారు. క్రిస్మస్ వేడుకలను శాంతియుతంగా జరుపుకోవాలని చందానగర్ ఇన్‌స్పెక్టర్ పాలవెల్లి తెలిపారు. పోలీస్‌స్టేషన్ పరిధిలోని పలు చర్చిల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశామని తెలిపారు.

### హుడాకాలనీలో ఘనంగా వేడుకలు..

చందానగర్ హుడాకాలనీలో సంకల్ప ఫౌండేషన్ నిర్వాహకురాలు రోజి ఆధ్వర్యంలో క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి సినీనటి, మాజీ ఎమ్మెల్యే జయసుధ హాజరై న్యాయమూర్తి అశోక్‌తో కలిసి వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా జయసుధ మాట్లాడుతూ మత సామరస్యానికి ప్రతీక క్రిస్మస్ అన్నారు. కేక్‌కట్ చేశారు. అనాథలకు దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కార్యక్రమంలో రిటైర్డ్ జడ్జి విజయజ్యోతి, బ్లూస్టార్ కంపెనీ ప్రతినిధులు, సంకల్పఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆల్విన్‌కాలనీ, డిసెంబరు 24(ఆంధ్రజ్యోతి): ఆల్విన్‌కాలనీ డివిజన్ కమలమ్మ కాలనీ, పీజేఆర్‌నగర్ కాలనీలో సోమవారం రాత్రి సెమీ క్రిస్మస్ వేడుకలు నిర్వహించారు. కార్యక్రమానికి కాంగ్రెస్ సీనియర్ నాయకుడు దొడ్ల రామకృష్ణగౌడ్ హాజరై ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం అందరికీ క్రిస్మస్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాస్టర్స్ ఇజ్రాయిల్, సత్యరాజ్, విక్టర్ ఇమ్మానుయేల్, దయానిధి, దేవదాస్, నాగభూషణం, సీమోను, ఏసుబాబు, రవీందర్ పాల్గొన్నారు.




విద్యుత్ దీపాల వెలుగుల్లో మియాపూర్‌లోని కల్వరిటెంపుల్